అడల్ట్స్ ఓన్లీ కథ

# వ్యసనం

## సర్వజిత్

బయటికి వెళ్లబోయే ముందు ఆఖరుసారి అద్దంలో చూసుకున్నాడు పాండురంగం. ఆరోసారి జుట్టు సరిచేసుకున్నాడు. ఎనిమిదోసారి ఇన్‌షర్ట్ చుట్టూ తిరిగి చూసుకుని సరిచేసుకున్నాడు.

హాల్లో నిల్చున్న భార్య హైమవతి భర్తని చూసి ముసిముసిగా నవ్వుకుంది. పెళ్లిలో అంతా 'మీ ఆయన సినీయాక్టర్ శోభన్‌బాబులా ఉంటాడే' అంటే, తనకీ అలానే అనిపించి తెగ మురిసిపోయింది.


అద్దం ముందు నుంచి పాండురంగం హాల్లోకొచ్చాడు. భార్యకేసి ఓ సినిమా నవ్వు విసిరి, బూట్లు తొడుక్కుని బయల్దేరారు.

అతనలా వెళ్లిపోతుంటే హైమవతి నిరాశపడింది. సినిమాల్లోలా అమాంతం తనను కౌగిట్లోకి తీసుకుంటాడని ఆమె చాలాసార్లు ఊహించుకుంది. ఊహించుకుని అతను వెళ్లే ముందు అలా హాల్లో నిల్చునేది. ఈ రోజు అలానే ఆమె ఎదురు చూసింది.

ఆమె ఆశ తీరలేదు. అతను బండి స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు.

పెళ్లి కానప్పుడు హైమవతి బాగా సినిమాలు చూసేది. పెళ్లయ్యాక, ఆమె బలహీనత అదీ అని తెలుసుకున్న పాండురంగం వచ్చిన సినిమాకల్లా తీసుకెళ్లాడు. ఇప్పుడూ తీసుకు వెళుతున్నాడు.

చదువయితే ఇంటర్ తప్పిందన్న మాటే గానీ, ఆకర్షణ విషయంలో తక్కువేమీ కాదామె. అటు పల్లె ఇటు పట్నమూ కానీ, మధ్యస్థంగా ఉన్న ఊళ్లో పుట్టి పెరిగిన ఆమె షోకులూ బాగానే చేస్తుంది.



''నీ నడుం మీద ముడతలు చాలా...గా ఉంటాయి సుమా!'' అని భర్త పాండురంగం అన్నప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయిపోయిందామె. టక్కున రాఘవేంద్రరావు సినిమాలు, ఆయన హీరోయిన్ బొడ్డుమీద, పిరుదుల మీద జామకాయలు, ద్రాక్షపళ్లు వేసిన సన్నివేశాలు గుర్తొచ్చాయామెకు.

కానీ, టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకుని, వళ్లంతా స్ప్రే వేసుకుని, భర్త ఆఫీసుకు వెళుతూ సినీ హీరోలా ఒక్కసారైనా కౌగిట్లోకి తీసుకోకపోవడం ఆమెకు నిరాశగానే అనిపిస్తుంది.

''హు! ఈ మనిషింతే'' అనుకుని డోర్ వేసి కిచెన్‌లోకి వెళ్లింది హైమవతి.

ఇంటి దగ్గర బయలుదేరిన పాండురంగం, ఫర్లాంగు దూరం వెళ్లాక ఎటు వెళ్లాలా అని క్షణంసేపు ఆలోచించి, ఆఫీసుకి ఇంకా పావుగంటపైనే టైముంది కదాని బండిని పక్క రోడ్డులోకి పోనిచ్చాడు.

మిత్రుడు సత్యం ఇంట్లో ఉంటాడా? ఉండడేమో? లాంటి ప్రశ్నలు క్షణం అతని మస్తిష్కాన్ని గందరగోళం చేశాయి. 'ఉండకపోతే బావుణ్ణు' అన్న ఆలోచన ఆ ప్రశ్నల మధ్యలో మొలకలా తేలింది.

అతనిలో గూడుకట్టుకున్న ఈ డైలమా ఇప్పటిది కాదు. రెండు మూడు నెలలుగా సాగుతున్నది. నిజానికి సత్యం ఆ ప్రాంతానికి అద్దెకొచ్చినట్లు తెలిసి, తను అతని ఇంటికి వెళ్లనప్పట్నుంచి.

అంతకు ముందు సత్యం చాలా దూరంగా ఉండేవాడు. నాలుగు నెలల కిందట ఆ ప్రాంతానికి మకాం మార్చాడు ఆఫీసుకు దగ్గరగా ఉంటుందని. అదీ భార్య ఆర్నెల్లుగా పోరు పెట్టాక.

సిటీలో అద్దెకు ఉండటమంటే అద్దెలు ఎక్కువ భరించాలని దూరంగా ఉంటున్నాడు సత్యం. ఇక భార్య పోరు పడలేక మారక తప్పింది కాదు.

అలా మకాం మారిన సత్యానికి ఓ రోజు సెంటర్‌లో పాండురంగం కనిపించాడు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరికొకరు కనిపించడం ఇదే. ఇద్దరూ బాల్య స్నేహితులు. దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలుకరించాడు పాండురంగాన్ని

**ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

సత్యం.

''హల్లో! నువ్వా... ఏంటి ఎక్కడుంటు న్నావ్?'' మామూలుగానే పలుకరించాడు సత్యాన్ని గుర్తుపట్టి పాండురంగం. చాన్నాళ్లకు కనిపించాడన్న ఉత్సాహంగానీ, సంతోషం గానీ లేదా పలకరింపులో.

''ఇక్కడే మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్నా కదా? మూడేళ్లయ్యిందిక్కడికొచ్చి'' సత్యం చెప్పాడు.

''మూడేళ్లయ్యిందా? మరెప్పుడూ కనపడ లేదేం?''

''మొన్నటిదాకా ఔట్‌స్కర్ట్స్‌లో ఉన్నాను. నెల రోజులయ్యింది ఈ ప్రక్కరోడ్డులోకి మారి. నువ్వేం చేస్తున్నావ్?''

''నేనా...బ్యాంకులో''

''ఇంకేంటి విశేషాలు?''

''ఏమున్నాయ్?''

''ఓ సండే మా ఇంటికి రా''

''అలాగే''

అలా సాగింది వాళ్ల మధ్య ఆ రోజు సంభాషణ. ఆ తర్వాత సత్యం గురించి మర్చిపోయాడు పాండురంగం. సాదాసీదా బట్టలు, అరిగిపోయిన చెప్పులు, చొక్కాపైన రెండు గుండీలు పెట్టుకొనకుండా ముఖం మీద పడే జుట్టు, ఎండిపోయినట్లుండే మనిషి సత్యం ఆకారం చూసి పాండు రంగానికి అతని మీద ఉత్సాహం కలగలేదు.

కానీ, అతను అలా కనిపించిన నెల రోజుల తర్వాత, అనుకోకుండా ఓ రోజు సాయంత్రం హడావిడిగా బండి మీద వస్తున్న పాండురంగానికి రోడ్డ మీద మళ్లీ కనిపించాడు సత్యం.

ఓ చిరునవ్వు నవ్వేసి వెళ్లిపోదామనుకున్నాడు పాండురంగం. కానీ కుదరలేదు. ఇంచుమించు బండికి అడ్డం పడ్డట్లు 'హలో! హలో!' అంటూ పలుకరించాడు సత్యం. ఇక బ్రేకు వెయ్యక తప్పలేదు పాండురంగానికి.

''ఏమిటి! మా ఇంటి ముందు నుంచీ వెళుతూ కూడా ఆగలేదు.. అదిగో ఆ తెల్ల డాబా.. అదే మా ఇల్లు...రా'' అన్నాడు సత్యం. సరిగ్గా రెండిళ్లు వెనకాలే అతను చెప్పిన తెల్ల డాబా ఇల్లు. ఇక తప్పించుకొనడానికి వీల్లేకపోయింది పాండురంగానికి.

మోటార్‌బైక్ వెనక్కి తిప్పాడు.

మనిషిలాగానే ఇల్లు సాదాసీదాగా అనిపించింది పాండురంగానికి. అతనికి కుర్చీ చూపించి, ''అనూ..అనూ..'' అంటూ భార్యను పిలిచాడు సత్యం.

''వస్తున్నా'' అన్న కమ్మని కంఠం వినిపించింది. మరుక్షణంలో అనూరాధ వచ్చింది ముందు వరండాలోకి.

''నా చిన్నప్పటి ఫ్రెండు పాండురంగం ఇక్కడే బ్యాంకులో చేస్తున్నాడు'' అంటూ అతన్ని భార్యకు పరిచయం చేశాడు సత్యం.

ఆమె నమస్కారం పెట్టింది. తన కళ్ల ముందు మెరుపుతీగ మెరిసినట్లు నిశ్చలంగా అయిపోయాడు పాండురంగం.

''అనూరాధ! నా వైఫ్‌రా'' సత్యం అనడంతో చటుక్కున తేరుకుని ప్రతినమస్కారం పెట్టాడు.

సాదా వాయిల్ చీర కట్టుకుంది. మెడలో పుస్తెల తాడు, నల్లపూసల దండ, చేతులకి మట్టిగాజులున్నాయి. పుస్తెలతాడు బంగారంలా అనిపించలేదు పాండురంగానికి.

విశాలమైన కనుదోయి, ఒత్తయిన నల్లని జుట్టు, నవ్వులొలికే పెదవులు, అందమైన శరీర సౌష్టవం- రెప్ప వాల్చలేకపోయాడు. ఆమె లోపలికి వెళ్లింది మెరుపు మెరిసి మాయమైనట్లు.

ఐదు నిముషాలకి స్వయంగా ఆమే టీ తీసుకు వచ్చి ఇచ్చి వెళ్లింది. సత్యం ఏదో చెబుతున్నాడు పాత విషయాలు. అవేమీ అతని చెవులకు సోకడం లేదు.

ఆమె రూపమే కనిపిస్తోంది. టీ సిప్ చేశాడు. బాగున్నట్లుంది. నిజంగా బాగుందో, ఆమె ఇవ్వడం వల్ల బాగుందో కచ్చితంగా అతను చెప్పలేడు. వాళ్లావిడ ఇచ్చే టీ కన్నా, తను హోటళ్లలో తాగే టీ కన్నా చాలా బాగుందనిపించింది.

అనాసక్తంగానే ఆ ఇంటికి వచ్చినా ఇప్పుడు మాత్రం లేవాలనిపించడం లేదు. తనకి తెలియకుండానే అరగంట సేపు కూర్చుండిపోయారు. ఇక బాగుండదని లేచాడు.

ఆ రోజు నుంచీ తరచూ సత్యం ఇంటికి రావడం ప్రారంభించాడు. సత్యాన్ని ఆప్తమిత్రుడిలా చూడ్డం మొదలెట్టాడు. అప్పుడప్పుడు అతన్ని సినిమాలకి తీసుకెళుతున్నాడు. అంతకన్నా సత్యానికి అమిత ఇష్టమైన బార్‌కీ తీసుకువెళుతున్నాడు.

సత్యం బలహీనత అతనికి స్పష్టంగా అర్థమయ్యింది. అతను మందుకి బానిస. అది మనిషిని గుల్ల చేసే వ్యసనం. అందుకే మనిషి అలా ఎండిపోయాడు తాగితాగి. అంతకు మించి చెడ్డవాడు కాదు. స్నేహానికి ప్రాణం ఇతడు.

చిన్ననాటి స్నేహితుడు అలా టౌన్‌లో కనిపించడం- అతనికి చాలా ఆనందంగా అనిపించింది. అందుకే



## ఇదో సెంటిమెంట్!

**ఇటీవల కాలంలో 'మంత్ర' చిత్రం ఛార్మికి మంచి పాపులారిటీ తెచ్చిపెట్టింది. అయితే ఆ తర్వాత చెప్పుకోదగిన విజయం లేకపోయినా తన కెరీర్ మరింత ముందుకెళ్లడానికి ఇంటి వాస్తును కూడా చార్మి నమ్ముకుందని ఫిలిం నగర్ కబురు. ఓ జ్యోతిష్యుడి సలహా మేరకు ఛార్మి తన ఇంట్లో ఓ చోట వాస్తుచేపని ఏర్పాటు చేసుకుందిట. ఈ చేప ఖరీదు యాభై వేలట కూడా. ఇంత ఖరీదు పెట్టి కొన్న చేప ఇంట్లో వుంటే ఎంత కరెన్సీ ఆ ఇంటికి వచ్చి చేరుతుందో కదా! ఏదేమైనా ఆ చేప పెట్టిన తర్వాత తనకి మంచే జరుగుతోందని ఛార్మి అంటోందిట.**

ఆప్యాయంగా పలుకరించాడు. ఇంటికి పిలిచాడు.

తన తాగుడికి సత్యం తన డబ్బులే ఖర్చు పెట్టుకుంటాడు తప్ప ఈ రోజు మందు ఎవరు పోయిస్తాడనో ఎవరి నెత్తిమీద చేతులు పెడదామనో ఎదురు చూడడు. భార్యాపిల్లలంటే అతనికి చాలా అభిమానం కూడా. ఆమె మెడలో బంగారు నగలు దిగెయ్యకపోవచ్చు వంటికి పట్టుచీరెలు చుట్టబెట్టకపోవచ్చు గానీ, తిండికి మాత్రం లోటు చెయ్యడు.

పదే పదే సత్యం ఇంటికొస్తున్న పాండురంగం, ఆ వచ్చే వేళల్లో మార్పులు చేసుకున్నాడు.

''ఏమిటి సత్యం అప్పుడే ఆఫీసుకు వెళ్లిపోయాడా...'' అని ''ఇంకా ఆఫీసు నుంచి రాలేదా...'' అనీ అడుగుతున్నాడు. తను వచ్చే టైములో అతను ఉండడని అతనికి తెలుసు!

ఇప్పుడిప్పుడే సత్యం భార్య అనూరాధకి అర్థమవుతోంది పాండురంగం ధోరణి.

భర్తకి బాల్య స్నేహితుడని మొదట్లో కాస్త కలివిడిగానే మాట్లాడిందామె. రానురానూ పాండురంగం ధోరణిలో మార్పు గమనించి కాస్త కలివిడితనం తగ్గించింది. అదైనా భర్త ఉన్నప్పుడే. అతను లేనప్పుడు పాండురంగం వస్తే ముభావంగానే సమాధానాలిస్తోంది.

''ఏమిటో! మనిషి మంచివాడే! ఈ తాగుడేమిటో? ఇలా వళ్లు, ఇల్లు, గుల్లచేసుకుని తాగేవాడు ఇక భార్యా బిడ్డల్నేం సుఖపెడతాడు?'' ఓ రోజు సత్యం లేనప్పుడు వచ్చి, వరండాలో కూర్చుని తలుపు దగ్గరే నిల్చున్న అనూరాధనుద్దేశించి, స్వగతంలా అనుకుంటున్నట్లు అన్నాడు పాండురంగం.

అనూరాధ మాట్లాడలేదు. ''మాకే లోటూ లేదు లెండి'' అని అందామనుకున్న మాటలు ఆమె పెదవుల మధ్యనే ఆపేసుకుంది.

సత్యం లాంటి వాళ్లు భార్యల్ని ఏమాత్రం సుఖపెట్టలేరన్నది పాండురంగం అభిప్రాయం. వాళ్ల వల్ల భార్యలకి శారీరకంగానూ మానసికంగానూ ఏమాత్రం సుఖం ఉండదని అతని గట్టి నమ్మకం.

ఇలాంటి కుటుంబాల్లో ఆడవాళ్లు, అందునా మధ్యతరగతి, ఇంకాస్త కింది తరగతి కుటుంబాల ఆడవాళ్లు తేలిగ్గా ఇతరుల వలలో పడిపోతారని అతని ప్రగాఢ విశ్వాసం.

దానికి తోడు అనూరాధ వంపుసొంపుల అతడ్ని మరీ గిలిగింతలు పెట్టేస్తున్నాయి. ఓ రోజు ఏపిల్స్ తెచ్చాడు పిల్లకని! మరోసారి స్వీట్స్ తెచ్చాడు పిల్లలకనే!

పాండురంగం మంచివాడనీ, చిన్నప్పుడు తామిద్దరూ చాలా సన్నిహితంగా ఉండేవాళ్లమనీ అప్పుడప్పుడు భార్యకి చెబుతూనే ఉన్నాడు సత్యం.

భర్త అభిప్రాయాన్ని మార్చాలని ఆమె అనుకోలేదు. అతనిలో ఆ ఒక్క వ్యసనమే లేకపోతే, సత్యం నిజంగా శ్రీరామచంద్రుడే! ఆ సంగతి ఆమెకు బాగా తెలుసు.

ఆ రోజూ అలానే- సత్యం ఇంటి దగ్గర ఉండడని తెలిసీ, ఆ ఇంటివైపు వెహికల్ పోనిచ్చాడు పాండురంగం. బండి స్టాండు వేసి, చనువుగా వరండా దాటి లోపలికి వచ్చేశాడు 'సత్యం' అని పిలుస్తూ.

పిల్లలు కాన్వెంటుకీ, భర్త ఆఫీసుకీ వెళ్లిపోవడంతో, ఉదయం నుంచీ పనితో హైరానా పడిన అనూరాధ రిలాక్స్‌గా మంచం మీద కూర్చుంది.

పాండురంగం మాట విని లేద్దామనుకుంటుండగా అతనే సరాసరి లోపలకొచ్చేశాడు. అతనితో బాటు ఘుమఘుమలూ వచ్చాయి గదిలోకి.

''ఆయన ఆఫీసుకు వెళ్లారు'' అంది మంచం మీద నుంచి లేస్తూ.

''అప్పుడే.. కూర్చో కూర్చో. నాకు అటు వెళ్లే పనుంది. బండిమీద డ్రాప్ చేద్దామని వచ్చాను. ఏమిటో కొంపలు మునిగిపోతున్నట్టు హడావిడిగా వెళ్లిపోతాడు ముష్టి మున్సిపల్ ఉద్యోగానికి'' మంచం దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ అన్నాడు పాండురంగం.

ఆమె ఏమీ మాట్లాడలేదు. కానీ, తన భర్త చేస్తున్న ఉద్యోగాన్ని కించబరుస్తూ మాట్లాడ్డం ఆమెకు నచ్చలేదు. అలాగని అతనితో వాదనకు దిగలేదు. అక్కణ్నుంచి కొంచెం దూరంగా వెళదామన్నా అతను కూర్చున్న కుర్చీ అడ్డంగా ఉంది. ఇఖ ఎటూ కదల్లేక, అలాగే ఉండిపోయింది.

'ఇదే సమయం' అన్నట్లు పాండురంగం మనస్సు తొందర చేస్తుంది.

''మంచినీళ్లు'' అనడిగాడు ఏం మాట్లాడాలో తెలీక.

ఆమె కొంచెం ముందుకొచ్చి 'తప్పుకోండి' అన్నట్లు ఆగింది. కుర్చీలోంచి లేవకుండానే కుర్చీని కొంచెం జరిపాడు. మరీ రాసుకుంటూ వెళ్లాలి. ఆమె కదల్లేదు. అతను మళ్లీ అలానే కుర్చీ జరిపాడు. సాధ్యమైనంతవరకూ అతన్ని తగలకుండా వెళ్లడానికి ప్రయత్నించిందామె. సరిగ్గా ఆ సమయంలోనే ఆమె పిరుదుల మీద చేయి వేశాడు పాండురంగం. విద్యుత్ షాక్ ఇచ్చినట్లు కంపించిందేమో. చప్పున అటు వెళ్లిపోయింది. అతనికేసి చూసింది నిర్భావంగా. అతను నవ్వుతున్నాడు.

ఆమె మంచినీళ్లు తేవడానికి వెళ్లలేదు. అక్కడే నిల్చుంది అతనికేసి చూస్తూ. అతని ముఖంలో అదే నవ్వు!

''అందుకోసమే వచ్చేటట్టయితే ఇంకెప్పుడూ ఈ ఇంటి ఛాయలక్కూడా రాకండి'' చాలా మామూలుగా అన్నదామె. అతని ముఖంలో నవ్వు మాయమైంది.

''నా భర్త ఒక తాగుబోతనీ, నేను తేలిగ్గా లొంగిపోతాననీ అనుకుంటున్నారేమో.. ఆయన వ్యసనపరుడేగానీ, మీకులా పరాయి వారి భార్యల్ని కామించే వ్యక్తి కాదు. స్నేహితుడికి ప్రాణం ఇస్తాడే కానీ, స్నేహితుడి భార్య వంటిమీద చెయ్యి వెయ్యాలనుకునే నీచబుద్ధి ఉన్నవాడు కాదు. చూడండీ! నా భర్తని నా ముందే విమర్శించే మీ సంస్కారం ఏ పాటిదో నేనర్థం చేసుకోగలను. ఆయన స్నేహితునిగా మంచి మనసుతో ఈ ఇంటికి మీరు రావడానికి నాకే అభ్యంతరం లేదు. అలా కాకుండా వేరే బుద్ధితో అయితే ఈ ఇంటి ఛాయలకి కూడా రాకండి'' అనేసి గబగబా లోపలకి వెళ్లిపోయింది అనూరాధ.

పాండురంగం ముఖం నల్లగా మాడిపోయింది. నవనాడులూ కూరుకుపోయినట్లయ్యింది. రెండు క్షణాలు పోయాక గానీ అతను కుర్చీలోంచి లేవలేకపోయాడు. లేచి మౌనంగా బయటికి వెళ్లిపోయాడు. ఆ సంఘటన జరిగాక ఇక అటుగా వెళ్లడానికి అతనికి ముఖం చెల్లలేదు. కానీ, అనుకోకుండా ఓ రోజు సత్యం కనిపించాడు సెంటర్లో.

''ఏంరా బొత్తిగా కనిపించడమే మానేశావ్?'' అన్నాడు ఆప్యాయంగా.

అంటే ఆ విషయం సత్యానికి తెలీదా? లోలోపల ఆశ్చర్యపోయాడు. ఎవరో బలంగా వెన్ను మీద చరచినట్లయ్యింది. అనూరాధ సంస్కారానికి మనసులోనే అభినందించుకున్నాడు.

సత్యం చేయి ఆప్యాయంగా అందుకుని నిజాయితీగా అన్నాడు. ''సాయంత్రం వస్తారా మీ ఇంటికి నా భార్యని తీసుకుని. అందరం కలసి సాయిబాబా గుడికి వెళ్లి, అక్కణ్నుంచి ఏదేనా పార్క్‌కి వెళదాం''

''ఓకె రా'' సత్యం అన్నాడు సంతోషంగా.

☆

